సాక్షి నంద్యాల

శుక్రవారం । 25 । ఏప్రిల్ । 2025



ఆకట్టుకున్న తోలు బొమ్మలాట

శ్రీశైలం టెంపుల్: ధర్మపథంలో భాగంగా గురువారం నిత్య కళా వేదికపై కడప జిల్లా పోరుమామిళ్లకు చెందిన కళాకారులు సుందరకాండపై తోలుబొమ్మలాట నిర్వహించారు.



.. పంచాయతీరాజ్ కీలకం

జెడ్పీ మినీ సమావేశ భవనంలో గురువారం జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవాన్ని నిర్వహించారు. గ్రామీణాభివృద్ధిలో పంచాయతీరాజ్ వ్యవస్థ కీలకమని వక్తలు అన్నారు. 8లో▸



అదుపుతప్పిన బస్సు

శ్రీశైలం- దోర్నాల ఘాట్ రోడ్డులో ఒక ప్రైవేట్ బస్సు కొండ చరియలను ఢీ కొట్టింది. డ్రైవర్‌కు తీవ్ర గాయాలు కాగా.. 20 మంది స్వల్ప గాయాలతో బయటపడ్డారు. 8లో▸

న్యూస్‌రీల్

రోడ్డు ప్రమాదాల నియంత్రణకు చర్యలు

- జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్



మాట్లాడుతున్న జేసీ విష్ణుచరణ్

నంద్యాల: రోడ్డు ప్రమాదాల నివారణ కోసం సత్వర చర్యలు తీసుకోవాలని అధికారులను జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్ ఆదేశించారు. కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో జిల్లా రహదారుల భద్రత సమన్వయ కమిటీ సమావేశాన్ని గురువారం నిర్వహించారు. నంద్యాల ఏఎస్పీ మందా జావళి అల్ఫోన్స్, ఆర్అండ్‌బీ ఎస్ఈ శ్రీధర్ రెడ్డి, ఆత్మకూరు డీఎస్పీ రామాంజనేయులు, ఆళ్లగడ్డ డీఎస్పీ ప్రమోద్, నంద్యాల మున్సిపల్ కమిషనర్ నిరంజన్ రెడ్డి, అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ... నేషనల్ హైవే ఎంట్రీ, ఎగ్జిట్ పాయింట్‌లో బోర్డులు ఏర్పాటు చేయాలని నంద్యాల మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. యన్‌హెచ్40 రహదారి చాబోలు సమీపంలో, శాంతిరాం ఆసుపత్రి దగ్గర బ్యారికేడ్లతో పాటు ఇల్యూమినేషన్ లైట్స్ ఏర్పాటు చేయాలన్నారు. జిల్లాలో మొత్తం 23 బ్లాక్ స్పాట్స్ ఉన్నాయని, అందులో 11 పూర్తి కాగా ఇంకా 12 పెండింగ్ ఉన్నాయని, వాటిని త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు గాయపడిన వారిని ఆసుపత్రిలో చేర్చేలా ఐరాడ్‌తో సమన్వయం చేసుకోవాలన్నారు. ఆర్అండ్‌బీ రోడ్లపై మార్కింగ్స్ వేయాలని సూచించారు.

మలేరియా నివారణ అందరి బాధ్యత

గోస్పాడు: మలేరియా నివారణ అందరి బాధ్యత అని డీఎంహెచ్ఓ వెంకటరమణ అన్నారు. నంద్యాలలోని కార్యాలయంలో గురువారం సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రతి ఏడాది ఏప్రిల్ 25వ తేదీన ప్రపంచ మలేరియా దినోత్సవంగా నిర్వహిస్తోందన్నారు. ప్రజల్లో అవగాహన కలిగించేందుకు అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పట్టణ ఆరోగ్య కేంద్రాల పరిధిలో ఆరోగ్య సిబ్బంది ర్యాలీలు నిర్వహించాలన్నారు. ఈ ఏడాది ప్రపంచ ఆరోగ్య సంస్థ 'మలేరియా అంతం మనతోనే' అనే నినాదంతో ప్రజల్లో అవగాహన కల్పిస్తోందన్నారు. సమావేశంలో జిల్లా మలేరియా అధికారి కామేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్ల తొలగింపు

నంద్యాల(అర్బన్): జిల్లాలో తొమ్మిది మంది ఫీల్డ్ అసిస్టెంట్లను తొలగిస్తూ పంచాయతీరాజ్ కమిషనర్ నుంచి ఉత్తర్వులు వచ్చాయని డ్వామా పీడీ వెంకటసుబ్బయ్య గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉపాధి హామీ పథకం కింద గ్రామ పంచాయతీలో కనీస పనిదినాలు కల్పించాలని తెలిపారు. అయితే కంటే తక్కువ పనిదినాలు కల్పించిన తొమ్మిది మంది ఫీల్డ్ అసిస్టెంట్లను విధుల నుంచి తొలగించినట్లు చెప్పారు. గోపాలాపురం గ్రామంలో రాజశేఖర్‌రెడ్డి, రామకృష్ణాపురంలో మహేష్‌చౌదరి, తిమ్మాపురంలో చాకలి శేఖర్, నేలంపాడులో వెంకటేశ్వర్‌రెడ్డి, తిరుపాడు గ్రామానికి చెందిన శేఖర్, గుంజలపాడు గ్రామంలో గోవిందరెడ్డి, కడుమూరులో రమేష్, గుంతనాలలో రమేష్‌బాబు, రాయమాల్పురంలో దేవన్నలను విధుల నుంచి తొలగిస్తూ ఉత్తర్వులు వచ్చాయని తెలిపారు.

కానిస్టేబుల్ అభ్యర్థులకు జూన్ 1న రాత పరీక్ష

కర్నూలు: కానిస్టేబుల్ అభ్యర్థులకు జూన్ 1వ తేదీన తుది రాత పరీక్ష నిర్వహించనున్నట్లు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పోలీసు నియామక మండలి ప్రకటన విడుదల చేసింది. పోలీస్ కానిస్టేబుల్, సివిల్, ఏపీఎస్పీ విభాగాల్లో పోస్టులకు సంబంధించి ప్రాథమిక రాత పరీక్ష 2023 జనవరి 22న జరిగింది. అర్హత సాధించిన వారికి 2024 డిసెంబర్ 30 నుంచి 2025 ఫిబ్రవరి 1 వరకు కర్నూలు ఏపీఎస్పీ రెండో పటాలం మైదానంలో దేహదారుఢ్య పరీక్షలు పూర్తి చేశారు. ఇందులో అర్హత సాధించిన వారందరికీ జూన్ 1న ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పరీక్ష నిర్వహించనున్నారు.

తనయుడు ఫెయిల్ అయ్యాడని తల్లి ఆత్మహత్య

కర్నూలు: పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో కుమారుడు భరత్‌బాబు ఫెయిల్ అయ్యాడనే మనస్తాపంతో తల్లి బెజవాడ లక్ష్మీజ్యోతి (39) ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. రవి, లక్ష్మీజ్యోతి దంపతులకు ఇద్దరు పిల్లలు సంతానం కాగా మొదటి కుమారుడు భరత్ బాబు పదవ తరగతి పరీక్షల్లో రెండు సబ్జెక్టులు ఫెయిల్ అయ్యాడు. బుధవారం ఫలితాలు వెలువడగా రాత్రి తల్లి లక్ష్మీజ్యోతి ఇంట్లోనే చీరతో ఉరేసుకుంది. ఆమె భర్త గుర్తించి ఉరి నుంచి తప్పించి ఆసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సాగుకు వెన్నుతట్టి.. కొనుగోళ్లకు పొగబెట్టి!

10 క్వింటాళ్లు మిగిలిపోయింది



ఐదెకరాల సొంత భూమితో పాటు మరో ఐదెకరాలు రూ.1.30లక్షలతో కౌలుకు తీసుకొని మిరప సాగు చేశాం. ఎకరాకు రూ.60వేల వరకు పెట్టుబడి పెట్టాం. 70 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. ఇప్పటి వరకు 60 క్వింటాళ్లు అమ్ముకున్నాం. క్వింటాకు రూ.12వేల నుంచి రూ.14,500 ధర లభించింది. మిగిలిన పది క్వింటాళ్లను కొనుగోలు చేయాలని ఐటీసీ కంపెనీ ప్రతినిధులను అడిగితే ఆలస్యం అవుతుందంటున్నారు. మిగిలిన పంటను కాపాడుకోవడం కష్టమవుతోంది. కౌలును మినహాయిస్తే పెట్టుబడి మాత్రమే దక్కుతుంది. – బుగ్గ రాముడు, కేతవరం, ఓర్వకల్ మండలం



నందికొట్కూరు మార్కెట్ యార్డులో విక్రయానికి నోచుకోని పొగాకు నిల్వలు

ఉమ్మడి జిల్లాలో 2024-25లో పొగాకు సాగు ఇలా..

జిల్లా	సాగైన విస్తీర్ణం(ఎకరాల్లో)
కర్నూలు	36,471
నంద్యాల	30,865
మొత్తం	67,336

రైతుల పాలిట 'పగా'కు!

- ఉమ్మడి జిల్లాలో 67,336 ఎకరాల్లో పొగాకు సాగు
- 50వేల టన్నుల వరకు దిగుబడి
- ఇప్పటి వరకు కొనుగోలు 20 వేల టన్నులే..
- పత్తాలేకుండా పోయిన కంపెనీల ప్రతినిధులు
- రైతుల కష్టాన్ని పట్టించుకోని ప్రభుత్వం
- అకాల వర్షాలతో దిక్కుతోచని రైతులు

కర్నూలు(అగ్రికల్చర్): కొనేవారు లేక పొగాకు రైతులు దిక్కులు చూసే పరిస్థితి. సాగు చేయండని ప్రోత్సహించిన కంపెనీలు ముఖం చాటేశాయి. ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఉత్పత్తి అయిన పొగాకులో ఇప్పటి వరకు సగం కూడా కొనుగోలు చేయలేదంటే రైతుల పరిస్థితి ఏ విధంగా ఉందో అర్థమవుతోంది. 2024-25 సంవత్సరంలో గతంలో ఎప్పుడూ లేని విధంగా పొగాకు సాగయింది. ఉత్పాదకత పెరగడంతో ప్రోత్సహించిన కంపెనీలు పత్తా లేకుండా పోయాయి. పండించిన పంటను ఎవరికి అమ్ముకోవాలో తెలియక.. గాలీవానలు, ఎండలతో పంటను కాపాడుకోవడం రైతులకు తలకు మించిన భారం అవుతోంది. రైతులకు అండగా నిలువాల్సిన జిల్లా యంత్రాంగం తమకేమీ సంబంధం లేదన్నట్లుగా వ్యవహరిస్తోంది. కంపెనీలు పలాయనం చిత్తగించడంతో ప్రయివేటు వ్యాపారులు అతి తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారు.



ఈనెల 16న దేవనకొండలో ఆలూరు ఎమ్మెల్యే విరూపాక్షికి కష్టాన్ని చెప్పుకుంటున్న పొగాకు రైతులు

నట్టేట ముంచిన కంపెనీలు

కూటమి ప్రభుత్వం 10 నెలల కాలంలో పొగాకు రైతుల స్థితిగతులపై ఏ ఒక్కరోజు దృష్టి సారించలేదు. దీంతో ప్రయివేటు కంపెనీలు ఇష్టారాజ్యంగా వ్యవహస్తున్నాయి. ఉమ్మడి కర్నూలు జిల్లాలో బార్లి(సిగరెట్) వీఐఎస్ -5, వీబీహెచ్-3 రకాలు, రుస్టిక(బీడీ) ఏ-119 రకాలతో పాటు నాటు రకాలు పెద్ద ఎత్తున సాగు చేశారు. అక్కడక్కడ ఫ్లూ క్యూర్డ్ వర్జీనియా పొగాకు కూడా సాగయింది. డిసెంబర్ నెల నుంచి పొగాకు క్రయవిక్రయాలు జరుగుతున్నా ఇప్పటి వరకు 50 శాతం కూడా కొన్న దాఖలాలు లేవు. ప్రధానంగా ఇండియన్ టొబాకో కంపెనీ(ఐటీసీ), అలయిన్స్-1 ఇంటర్నేషన్, వీఎస్‌టీ, గాడ్స్ ప్రే పిలిప్ ఇండియా లిమిటెడ్ కంపెనీలు రైతులతో పొగాకు సాగు చేయించాయి. కంపెనీల అసోసియేషన్ నిర్ణయించిన ధర ప్రకారం కొనుగోలు చేస్తామని రైతులను నమ్మించి నట్టేట ముంచాయి. ఐటీసీ మాత్రం ప్రస్తుతం అరకొరగా కొనుగోలు చేస్తున్నప్పటికీ మిగిలిన కంపెనీలు పూర్తిగా నిలిపేశాయి. సంప్రదించడానికి కూడా ఆయా కంపెనీల ప్రతినిధులు అందుబాటులో లేకపోవడం గమనార్హం.

10.04.25

- బండిఆత్మకూరు మండల పరిధిలోని యర్రగుంట్ల గ్రామంలో ఒక పొగాకు షెడ్డు దగ్ధమైంది. గ్రామానికి చెందిన బొబ్బల పరమేశ్వర రెడ్డి తన ఎకరా పొలంలో పొగాకు పంటను సాగు చేశాడు. దిగుబడులను క్యూరింగ్ కోసమని షెడ్డు ఏర్పాటు చేసుకున్నాడు. అందులో నుంచి మంటలు చెలరేగి పూర్తిగా కాలిపోయింది. ఘటనలో దాదాపు రూ.3 లక్షల విలువైన పొగాకు కాలిపోయినట్లు రైతు ఆవేదన వ్యక్తం చేశాడు.

సాగు పెరిగి.. నష్టాలు మిగిలి

ఉమ్మడి జిల్లాలో పొగాకు సాగు లేని మండలం లేదంటే అతిశయోక్తి కాదు. 10 ఎకరాల నుంచి 100 ఎకరాలు సాగు చేసిన రైతులు ఉన్నారు. ఎకరాకు రూ.20 వేల నుంచి రూ.25 వేల వరకు కౌలుకు తీసుకొని మరీ సాగు చేశారు. 2023-24లో రికార్డు స్థాయి ధరలు లభించడంతో ఈ ఏడాది రైతులు సాగుకు రెండు జిల్లాల్లో పోటీపడ్డారు. కంపెనీలు కూడా అదేవిధంగా ప్రోత్సహించాయి. 2024-25లో కర్నూలు జిల్లాలో 36,471 ఎకరాలు, నంద్యాల జిల్లాలో 30,865 ఎకరాల్లో పొగాకు సాగయింది. 2023-24తో పోలిస్తే 48,959 ఎకరాల్లో అదనంగా సాగు చేయడం విశేషం. విత్తనం మొదలు పొగాకును కొనుగోలు కేంద్రానికి తీసుకెళ్లే వరకు ఎకరాకు రూ.60 వేల వరకు పెట్టుబడి పెడుతున్నారు. ఎకరాకు సగటున 4 క్వింటాళ్ల వరకు మాత్రమే దిగుబడి వచ్చింది. కంపెనీలు అరకొరగా కొనుగోలు చేసి చేతులెత్తేయడంతో రైతులు రోడ్డెక్కుతున్నారు.



కొత్తపల్లి మండలం నందికుంట సమీపంలో ఇటీవల కురిసిన వర్షానికి తడిసిన పొగాకు

ధరలో అడ్డంగా కోత

పొగాకు కంపెనీల అసోసియేషన్ ఖరారు చేసిన ధరలను పలు కంపెనీలు ఏ మాత్రం పరిగణనలోకి తీసుకోని పరిస్థితి. అడ్డంగా కోత వేస్తున్నాయి. వాస్తవానికి సాగుకు ముందు రూ.18వేలతో కొంటామని నోటి మాటగా చెప్పారు. జనవరి, ఫిబ్రవరి నెలల్లో అసోసియేషన్ నిర్ణయించిన ధర రూ.15,500 ఉంటే.. రూ.13వేల నుంచి రూ.15వేలకు కొనుగోలు చేశారు. ఆ తర్వాత క్రమంగా ధరలను తగ్గిస్తూ రావడంతో రైతులు నష్టపోవాల్సి వచ్చింది. మార్చి, ఏప్రిల్ నెలల్లో నాణ్యత లేదనే సాకుతో ధరను అమాంతం రూ.8వేల నుంచి రూ.12వేలకు తగ్గించడంతో రైతుల్లో గగ్గోలు పెడుతున్నారు.

గుట్టలుగా మిగిలిపోయిన పొగాకు నిల్వలు

ఉమ్మడి కర్నూలు జిల్లాలో పొగాకు నిల్వలు పేరుకుపోయాయి. మామూలుగా ఈ సమయానికి కొనుగోళ్లు పూర్తవ్వాలి. కానీ ఇప్పటికీ ఎటు చూసినా పొగాకు నిల్వలే కనిపిస్తున్నాయి. 2024-25లో ఉమ్మడి జిల్లాలో దాదాపు 50వేల టన్నుల దిగుబడి వచ్చింది. ఇప్పటి వరకు కంపెనీలు కేవలం 20వేల టన్నులు కూడా కొనుగోలు చేసిన దాఖలాలు లేవు. అంటే రైతుల దగ్గర ఇప్పటికి 50 శాతంపైగా నిల్వలు ఉండిపోయాయి.



ర్యాలీలో పాల్గొన్న వీహెచ్‌పీ, భజరంగ్‌దళ్, బీజేపీ నాయకులు



గాంధీ విగ్రహం వద్ద కొవ్వొత్తులతో ప్రదర్శన

ఉగ్రవాదం నశించాలి.. శాంతి వర్ధిల్లాలి

కశ్మీర్‌లో ఉగ్రవాదుల దాడిని నిరసిస్తూ హిందూ పరిరక్షణ వేదిక జిల్లా అధ్యక్షుడు రాజేశ్ శర్మ ఆధ్వర్యంలో గురువారం కర్నూలు రాజ్‌విహార్ నుంచి కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. గాంధీ విగ్రహం వద్ద కొవ్వొత్తుల ప్రదర్శన చేసి మృతులకు నివాళులర్పించారు. 'ఉగ్రవాదం నశించాలి.. శాంతి వర్ధిల్లాలి' అంటూ నినాదాలు చేశారు. ప్రజలంతా ప్రధాని నరేంద్రమోదీకి అండగా నిలవాలని, ఉగ్ర దాడులను తిప్పికొట్టాలని హిందూ ధర్మ పరిషత్ నాయకులు ప్రతాప్‌రెడ్డి, రంగస్వామి, మద్దిలేటి, మహేశ్వర్, రామకృష్ణ కోరారు. ర్యాలీలో వీహెచ్‌పీ, భజరంగ్‌దళ్, బీజేపీ నాయకులు పాల్గొన్నారు. – కర్నూలు సెంట్రల్

అహోబిలం.. 'వసంతో' వైభవం

ఆళ్లగడ్డ: దిగువ అహోబిలంలో వసంతోత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నారు. వసంత రుతువులో శ్రీ లక్ష్మీనరసింహస్వామికి జరిగే ఈ ఉత్సవానికి వసంతోత్సవం అని పేరు. ఎండ వేడి నుంచి స్వామివారు ఉపశమనం పొందేందుకు జరిపే ఉత్సవం కావడంతో ఉపశమనోత్సవం అని కూడా అంటారు. ఉత్సవంలో సుగంధాన్ని వెదజల్లే పుష్పాలతో పాటు పలురకాల మధురఫలాలను స్వామికి నివేదిస్తారు. వేడుకల కోసం దేవాలయం ఎదురుగా భాష్యకార మండపంలో ఆకర్షణీయంగా మండపాన్ని తీర్చిదిద్దారు. అలాగే పలురకాల వృక్షాల ప్రతిరూపాలతో నల్లమల అడవిని తలపించేలా మండపాన్ని తీర్చిదిద్దారు. గురువారం ఉదయం నిత్య పూజలు అనంతరం యాగశాలకు చేరుకున్న శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ ప్రహ్లాదవరదస్వాములను కొలువుంచారు. ఆస్థాన విద్వాంసుల మంగళ వాయిద్యాలు, అర్చకుల వేద మంత్రోచ్ఛారణల మధ్య తిరుమంజనం నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.



ఉత్సవమూర్తులకు తిరుమంజనం నిర్వహిస్తున్న దృశ్యం

ఉగ్ర భానుడు

- దొర్నిపాడులో అత్యధికంగా 43.8 డిగ్రీల ఉష్ణోగ్రత

కర్నూలు(అగ్రికల్చర్): భానుడి భగభగలకు జిల్లా ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. కొద్ది రోజులుగా రాష్ట్రంలోనే ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఎండలు, వడగాల్పుల తీవ్రత అధికంగా ఉన్నట్లు స్పష్టమవుతోంది. గురువారం దొర్నిపాడులో రాష్ట్రంలోనే అత్యధికంగా 43.8 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. గోస్పాడులో 43.4, రుద్రవరంలో 43.4 , కొతాళంలో 42.7, కర్నూలు అర్బన్‌లో 42.3, మంత్రాలయంలో 42.2 డిగ్రీల ప్రకారం ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. పలు మండలాల్లో 40 డిగ్రీలకుపైగా ఉష్ణోగ్రతలు నమోదు కావడం గమనార్హం. రానున్న మూడు రోజులు కూడా ఉష్ణోగ్రతలు ఆందోళన కలిగించేలా ఉంటాయని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.

ఆర్‌యూలో నిత్యం సమస్యల 'పరీక్ష'

- గురువారం ఒక విద్యార్థికి బదులు మరో విద్యార్థి పరీక్ష రాస్తుండగా గుర్తింపు
- బీఈడీ మూడో సెమిస్టర్ పరీక్ష ఫీజు చెల్లింపు నేటితో గడువు పూర్తి
- ఫీజు చెల్లింపునకు వెబ్‌సైట్‌లో కానరాని విద్యార్థుల పేర్లు



ఆర్‌యూ పరిపాలనా భవనం

కర్నూలు కల్చరల్: రాయలసీమ యూనివర్సిటీ పరీక్షల విభాగంలో గందరగోళం వీడటం లేదు. నిత్యం ఏదో ఒక సమస్యతో నెట్టుకురావడం తప్ప పరిష్కార మార్గాలు అంతంతమాత్రంగానే ఉన్నాయి. ఈనెల 23న బీఈడీ మొదటి సెమిస్టర్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. అయితే రెండు కళాశాలల విద్యార్థులకు పరీక్ష ప్రారంభానికి అరగంట ముందు కూడా హాల్‌టికెట్లు రాకపోవడంతో ఆందోళన చెందారు. దీంతో పాటు విద్యార్థుల వివరాలతో కూడిన ప్రింటెడ్ ఓఎమ్మార్ షీట్లు ఏర్పాటు చేయలేకపాయారు. డోన్‌లో ఓ పరీక్ష కేంద్రం, కర్నూలులో ఓ పరీక్ష కేంద్రంలో సుమారు 90 మంది విద్యార్థులతో బఫర్ ఓమ్మార్ షీట్లలో వివరాలు నమోదు చేయించి పరీక్ష రాయించారు. వివరాలు నమోదు చేసే సమయంలో పొరపాటు చేస్తే ఆ విద్యార్థి ఇబ్బందులు ఎదుర్కోవాల్సిందే. గురువారం జరిగిన పరీక్షకు కర్నూలు ఉస్మానియా కళాశాల కేంద్రంలో శాంతినికేతన్ కళాశాలకు చెందిన ఓ విద్యార్థి స్థానంలో మరో విద్యార్థి పరీక్ష రాస్తూ పట్టుబడటం పర్యవేక్షణ లోపమనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

జిరాక్స్ ప్రశ్నపత్రాలు

రెండు పరీక్ష కేంద్రాల్లో ప్రింటెడ్ కాకుండా జిరాక్స్ ప్రశ్నపత్రాలతో పరీక్షలు రాయిస్తున్నారు. పరీక్ష ప్రారంభమయ్యే సమయానికి అర గంట ముందు ప్రశ్నపత్రాల షీల్డ్‌బండిల్‌ను తెరుస్తారు. అందులోంచి ప్రశ్నపత్రాలను తీసుకొని వాటిని జిరాక్స్ తీయించి పరీక్షలు రాయిస్తున్నారు. అదే సమయంలో ప్రశ్నా పత్రం లీక్ అయినా, కరెంట్ పోయినా, ప్రింటర్ పనిచేయకపోయినా ఏంటనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.

వెబ్‌సైట్‌లో కానరాని విద్యార్థుల పేర్లు

2023-25 విద్యా సంవత్సరం బీఈడీ మూడో సెమిస్టర్ రెగ్యులర్, సప్లిమెంటరీ పరీక్షల ఫీజును శుక్రవారంలోగా చెల్లించేందుకు వర్సిటీ అధికారులు గడువు విధించారు. అయితే గురవారం అర్ధరాత్రి వరకు ఫీజు చెల్లింపుకు ఎస్ఆర్‌లో విద్యార్థుల పేర్లు పెట్టలేదు. దీంతో ఒక్కరోజులోనే విద్యార్థులకు ఎప్పుడు సమాచారం ఇవ్వాలి, ఫీజు ఎప్పుడు చెల్లించాలని కళాశాలల యాజమాన్యాలు తలలు పట్టుకుంటున్నాయి.

ఏజెన్సీ మారడంతో సమస్యలు

పరీక్షల నిర్వహణకు సంబంధించి ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నాం. పరీక్ష నిర్వహణ ఏజెన్సీ మారడంతో కొన్ని సాంకేతిక సమస్యలు ఉత్పన్నవుతున్నాయి. త్వరలోనే పరిష్కరిస్తాం. వీసీతో చర్చించి బీఈడీ మూడో సెమిస్టర్ పరీక్ష ఫీజు చెల్లింపు గడువు పెంచేందుకు నిర్ణయం తీసుకుంటాం. ఒక విద్యార్థి స్థానంలో మరో విద్యార్థి పరీక్ష రాస్తూ దొరకడంతో అతనిపై పోలీస్‌లకు ఫిర్యాదు చేశాం.

– డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్లు, సీఈ, ఆర్‌యూ

'అమ్మ'ల కోసం


తల్లుల కోసం ఏర్పాటు చేసిన కేంద్రం

మహానంది పుణ్యక్షేత్రంలో అధికారులు మాతృదేవోభవ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. రాష్ట్ర దేవదాయశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు ఆలయాల్లో చేపడుతున్న ప్రత్యేక ఏర్పాట్లలో భాగంగా భక్తుల సౌకర్యాల కల్పనపై అధికారులు దృష్టి సారించారు. అందులో భాగంగా మహానందిలోని ప్రసాదాల కౌంటర్ పక్కన చిన్నపిల్లల తల్లుల కోసం బ్రెస్ట్ ఫీడింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. పిల్లలకు తల్లులు పాలు ఇచ్చేందుకు ప్రత్యేక గదిని ఏర్పాటు చేశామని, తల్లులు వినియోగించుకోవాలని మహానంది ఆలయ ఈఓ నల్లకాలువ శ్రీనివాసరెడ్డి కోరారు. – మహానంది

గ్రామీణాభివృద్ధిలో పంచాయతీరాజ్ కీలకం

- జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషా


మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా


హాజరైన పంచాయతీరాజ్ ఉద్యోగులు

కర్నూలు(అర్బన్): గ్రామీణాభివృద్ధి, స్థానిక పాలనలో పంచాయతీరాజ్ వ్యవస్థ కీలక పాత్ర పోషిస్తున్నదని జిల్లా కలెక్టర్ పీ రంజిత్‌బాషా అన్నారు. గురువారం జిల్లా పరిషత్ మినీ సమావేశ భవనంలో జెడ్పీ డిప్యూటీ సీఈఓ ఈవీ సుబ్బారెడ్డి అధ్యక్షతన జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. 2025లో ఉన్న పంచాయతీరాజ్ వ్యవస్థకు 1947 స్వాతంత్ర్యం వచ్చిన అనంతరం ఉన్న పరిస్థితికి చాలా వ్యత్యాసం ఉందన్నారు. 73వ రాజ్యాంగ సవరణ ద్వారా 11వ షెడ్యూల్‌లో 243 ఆర్టికల్ ద్వారా పంచాయతీరాజ్ వ్యవస్థను రూపొందిస్తూ చట్టం చేశారన్నారు. ఈ చట్టాన్ని రాజ్యసభ, లోక్‌సభతో పాటు దేశంలోని అన్ని రాష్ట్రాల అసెంబ్లీల్లో కూడా ఆమోదం చేసిన తరువాత 1993 ఏప్రెల్ 24వ తేదీన నుంచి అమల్లోకి వచ్చిందన్నారు. ఈ నేపథ్యంలోనే పంచాయతీరాజ్ వ్యవస్థలో పర్యవేక్షణ బలోపేతం అయ్యిందన్నారు. పంచాయతీలకు చట్టపరమైన గుర్తింపు ఇవ్వడం, స్వయం ప్రతిపత్తి కల్పించడం వంటి సంస్కరణలు వచ్చాయన్నారు. ఫైనాన్స్ పరిధిలోకి రావడం, స్టేట్ ఎలక్షన్ కమిషన్ ద్వారా సక్రమంగా ఎన్నికల్లో ఎస్సీ, ఎస్టీలకు 50 శాతం రిజర్వేషన్, మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించడం జరిగిందన్నారు. స్థానిక పాలనా వ్యవహారాలను సమర్థవంతంగా నిర్వహించడంలో పీఆర్ సంస్థలు కీలకంగా వ్యవహరిస్తున్నాయన్నారు.

నేషనల్ ఈ గవర్నెన్స్ అవార్డుకు పెరవలి ఎంపిక..

నేషనల్ ఈ గవర్నెన్స్ అవార్డుల కోసం దేశ వ్యాప్తంగా 1.40 లక్షల దరఖాస్తులు రాగా, ఇందులో ఆరు గ్రామ పంచాయతీలను ఎంపిక చేశారని కలెక్టర్ చెప్పారు. ఎంపికైన ఆరు గ్రామ పంచాయతీల్లో జిల్లాలోని మద్దికెర మండలం పెరవలి గ్రామ పంచాయతీ ఉండడం అభినందనీయమన్నారు. అలాగే ఆస్పిరేషనల్ బ్లాక్ ప్రోగ్రామ్ కింద జిల్లాలోని మద్దికెర, హొళగుంద, చిప్పగిరి మండలాలు ఎంపికయ్యాయన్నారు. ఇందులో మద్దికెర మండలం దక్షిణ భారత దేశంలో ప్రథమ స్థానంలో ఉందని, ఇందుకు కేంద్ర ప్రభుత్వం రూ.1.50 కోట్లను మంజూరు చేసిందన్నారు. కార్యక్రమంలో పీఆర్, ఆర్‌డబ్ల్యూఎస్ పర్యవేక్షక ఇంజనీర్లు వీ రామచంద్రారెడ్డి, బీ నాగేశ్వరరావు, కర్నూలు డివిజనల్ పంచాయతీ అధికారిణి టీ లక్ష్మి, పీఆర్ ఈఈ మద్దన్న, పీపీటు ఎస్ఈ బండారు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ సేవలకు సత్కారం

జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవ సందర్భంగా పంచాయతీరాజ్ విభాగంలో విశిష్ట సేవలు అందించిన అధికారులు, ఉద్యోగులకు జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషా మెమెంటో, ప్రశంసా పత్రాలను అందించారు.


పంచాయతీరాజ్ ఎస్ఈ వి.రామచంద్రారెడ్డికి ప్రశంసాపత్రం, మెమెంటో అందిస్తున్న జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా


బి.నాగేశ్వరరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ


ఎస్‌సీఈఈ మద్దన్న, పంచాయతీరాజ్ ఈఈ


అల్లాబకాష్, చిప్పగిరి ఎంపీడీఓ


ఎ.శివనాగప్రసాద్, ఎంపీడీఓ, గూడూరు


జి.రఘునాథ్, ఎంపీడీఓ, కర్నూలు


కె.వరలక్ష్మి, ఎంపీడీఓ, హొలగుర్వి


సుహాసినమ్మ, ఎంపీడీఓ, వెల్దుర్తి


జి.కృష్ణారెడ్డి, ఏఓ, కోడుమూరు


పుల్లయ్య, ఏఓ, జెడ్పీ


శ్రీనివాసులు, వీడీఓ, జెడ్పీ


సిద్ధారెడ్డి, సీనియర్ సహాయకులు, జెడ్పీ


ఖలీలుల్లా, జూనియర్ సహాయకులు, జెడ్పీ


ఆర్‌బీవీ కృష్ణారావు, ఆఫీస్ సబార్డినేట్, జెడ్పీ


టి.లక్ష్మి, డీఎల్‌పీఓ, కర్నూలు


బి.ప్రభావతి, ఈఓఆర్‌డీ, మంత్రాలయం


పి.రవికిషోర్, ఈఓఆర్‌డీ, వెల్దుర్తి


ఎస్.సాయితేజ, జూనియర్ అసిస్టెంట్, డీపీఓ


కె.శిరీష రాణి, సీనియర్ అసిస్టెంట్, డీఎల్‌పీఓ, కర్నూలు


ఆర్.తిమ్మప్ప, జూనియర్ అసిస్టెంట్, డీఎల్‌పీఓ, ఆదోని


బి.వెంకటేశ్వర్లు, గ్రేడ్-4 పీఎస్, లద్దగిరి


ఎస్.పరిమళ, గ్రేడ్-5 పీఎస్, బంటనహాల్


ఎ.సురేష్, జూనియర్ అసిస్టెంట్, కోడుమూరు


టి.సతీష్, జూనియర్ అసిస్టెంట్, గోనెగండ్ల


ఓ.చంద్రశేఖర్, ఆఫీస్ సబార్డినేట్, డీఎల్‌పీఓ, కర్నూలు


బి.మారుతి ప్రసాద్, సీనియర్ అసిస్టెంట్, డీపీఓ

ప్రభుత్వాసుపత్రిలో నాగుపాము కలకలం

ఎమ్మిగనూరురూరల్: స్థానిక ప్రభుత్వాసుపత్రిలోని పిల్లల వార్డులో గురువారం నాగుపాము కలకలం సృష్టించింది. పిల్లల వార్డులో పామును గుర్తించిన తల్లులు కేకలు వేయటంతో అక్కడ ఉన్న బంధువులు వచ్చి పామును కర్రలతో వార్డు నుంచి బయటకు వెళ్లేలా చేశారు. అనంతరం బయటకు వచ్చిన పామును చంపటంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. గతంలో చాలా సార్లు పాములు ఆసుపత్రిలో వచ్చిన సంఘటనలు ఉన్నాయి. అసుపత్రి అవరణలో అపరిశుభ్రంగా ఉండటంతో పాములు వార్డుల్లోకి వస్తున్నాయని రోగులు వాపోతున్నారు.

శ్రీశైలం ఘాట్‌లో అదుపుతప్పిన బస్సు

- డ్రైవర్‌కు తీవ్ర గాయాలు
- 20 మంది ప్రయాణికులకు స్వల్పగాయాలు


బ్రేక్ ఫెయిల్‌తో కొండచరియను ఢీకొన్న ప్రైవేట్ బస్సు

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలం ఘాట్ రోడ్డులో గురువారం ఉదయం ఓ ప్రైవేటు బస్సు బ్రేక్ ఫెయిల్ కావడంతో అదుపుతప్పి కొండ చరియను ఢీ కొంది. ఈ ప్రమాదంలో డ్రైవర్‌కు తీవ్ర గాయాలు, 20 మంది స్వల్ప గాయాలతో బయటపడ్డారు. కర్ణాటక రాష్ట్రం బళ్లారి జిల్లా సిరిగుప్ప ప్రాంతానికి చెందిన 40 మంది భక్తులు తీర్థయాత్రలకు బయలుదేరారు. గురువారం ఉదయం 8 గంటల సమయంలో చిన్నారుట్ల ఘాట్ రోడ్డులో బస్సు బ్రేకులు ఫెయిల్ కావడంతో డ్రైవర్ బస్సు లోయలో పడకుండా పక్కనే ఉన్న కొండ చరియలను ఢీ కొట్టాడు. ప్రమాదంలో బస్సు డ్రైవర్ ఫయాజ్ (28) తీవ్ర గాయాలయ్యాయి. 20 మంది భక్తులకు స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108లో సున్నిపెంట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తీవ్రంగా గాయపడిన డ్రైవర్ ఫయాజ్‌ను మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు తరలించారు. ప్రకాశం జిల్లా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మొక్క జొన్న పంట దగ్ధం


దగ్ధమైన మొక్క జొన్న పంటను పరిశీలిస్తున్న తహసీల్దార్ నరేంద్రనాథ్‌రెడ్డి

పాణ్యం: మండల కేంద్రమైన పాణ్యంలోని దొంగు సమీపంలో చేతికొచ్చిన మొక్కజొన్న పంట అగ్ని ప్రమాదంలో కాలి బూడిదైంది. గ్రామంలోని రైతు వై.వి లింగమయ్యకు చెందిన 3 ఎకరాలు, లింగాల సుబ్రహ్మణ్యంకు చెందిన 3 ఎకరాలు, గుడిపాటి మద్దిలేటికి చెందిన 1.50 ఎకరాల పంట దగ్ధమైంది. పొలంలో మంటలు వ్యాపించడంతో గమనించిన రైతులు నంద్యాల అగ్నిమాపక స్టేషన్‌కు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది చేరుకుని మంటలను అదుపు చేశారు. మరో రోజుల్లో మూడు రోజుల్లో పంట కోత చేపట్టాల్సిన సమయంలో ప్రమాదం జరగడంతో రైతులు నష్టపోయారు. బోర్ వైర్ నుంచి మంటలు చేలరేగి పంటలకు వ్యాపించినట్లు ప్రాథమికంగా తెలిసింది. ఎకరానికి రూ. 35వేలకు వరకు పెట్టుబడులు పెట్టామని, ప్రభుత్వం తమను ఆదుకోవాలని కోరారు. సమాచారం అందుకున్న తహసీల్దార్ నరేంద్రనాథ్‌రెడ్డి, ఆర్ఐ రాము, వ్యవసాయ అధికారులు దగ్ధమైన పంటను పరిశీలించారు.

రెండు ఇళ్లలో చోరీ


తిరుపాలయ్య ఇంట్లో వస్తువులు చెల్లాచెదురుగా పడేసిన దృశ్యం

నందికొట్కూరు: పట్టణంలోని సుబ్బారావుపేట, అల్లూరు రోడ్డు బీఎస్ఎన్ఎల్ ఆఫీస్ ఎదురుగా రెండు ఇళ్లలో చోరీ జరిగింది. ఇళ్ల తాళాలు పగలగొట్టి అందినకాడికి దోచుకెళ్లారు. సుబ్బరావుపేటలో నివాసం ఉంటున్న బాలాజీ మెడికల్ షాపు యజమాని తిరుపాలయ్య కుటుంబసభ్యులతో కలసి బెంగళూరు బంధువుల ఫంక్షన్‌కు వెళ్లారు. కాగా బుధవారం రాత్రి దొంగలు ఇంటి, బీరువా తాళాలు పగలగొట్టి ఆరు తులాల బంగారు ఆభరణాలు దోచుకెళ్లారు. గురువారం ఇంటికి చేరుకొని చూస్తే తలుపులు తెరిచి ఉండటం గమనించి పోలీసులకు సమాచారం అందించారు. అలాగే అల్లూరు రోడ్డులో నివాసం ఉంటున్న బీజేపీ జిల్లా కార్యదర్శి గూడూరు రవికుమార్‌రెడ్డి ఇంటిలో 50 గ్రాముల వెండి, నాలుగు గ్రాముల బంగారు ఉంగరం, రూ. 38 వేల నగదు అపహరించారు. అన్న కొడుకు పెళ్లి ఉండటంతో తెలంగాణలో బంధువులకు శుభలేఖలు పంచేందుకు వెళ్లారు. గురువారం ఇంటికి చేరుకున్న ఆయన తలుపులు తెరిచి ఉండటంతో చోరీ జరిగిందని భావించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఈ మేరకు రెండు ఇళ్లను పోలీసులు పరిశీలించారు. దొంగల కోసం గాలింపు చర్యలు చేపట్టినట్లు తెలిపారు.

స్పెషల్ ఒలింపిక్స్‌లో స్వర్ణ పతకం


స్వర్ణ పతకంతో భాను ప్రసాద్

నందికొట్కూరు: స్థానిక కోట జెడ్పీ హైస్కూల్ 9వ తరగతి విద్యార్థి భాను ప్రసాద్ రాష్ట్రస్థాయి స్పెషల్ ఒలింపిక్స్ భారత్ క్రీడల్లో స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకున్నాడు. ఏలూరు జిల్లా ఆగిరిపల్లి మండలం తోటపల్లిలో హీల్ స్కూల్‌లో ఈనెల 23 జరిగిన రాష్ట్రస్థాయి స్పెషల్ (ప్రత్యేక అవసరాలు గల క్రీడాకారులు) ఒలంపిక్స్ భారత్ క్రీడల్లో నంద్యాల జిల్లా తరుపున 50 మీటర్ల పరుగు పందెంలో భాను ప్రసాద్ స్వర్ణ పతకం సాధించారు. ఈ మేరకు గురువారం పాఠశాల హెచ్ఎం సాలమ్మ, ఫిజికల్ డైరెక్టర్ శ్రీనాథ్, ఉపాధ్యాయులు క్రీడాకారుడిని అభినందించారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ భాను ప్రసాద్ అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఈఆర్‌టీ రవి బాబు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

సిబ్బంది.. ఇబ్బంది

- హడావుడిగా పీఐయూ కార్యాలయం మార్పుతో అవస్థలు
- కర్నూలు నుంచి నంద్యాల కేంద్రానికి తరలింపు
- సిబ్బంది కూర్చోవడానికి సరైన వసతులు కరువు


నంద్యాల పీఆర్ కార్యాలయానికి చేర్చిన టేబుళ్లు, కుర్చీలు

గోస్పాడు: ఓ సాధారణ వ్యక్తి అద్దె ఇల్లు మారాల్సి వస్తే కనీస సౌకర్యాలు చూసుకున్న తర్వాత ఆ ఇంటికి వెళ్తాడు. అదే ఓ కార్యాలయాన్ని మరో చోటుకు తరలించాలంటే ఎన్నో జాగ్రత్తలు తీసుకోవాలి. అధికార, సిబ్బందికి సౌకర్యాలు ఉన్నాయా.. లేవా అని చూసుకోవాలి. కానీ పంచాయతీరాజ్ శాఖలో ఉన్నతాధికారుల నిర్లక్ష్యంతో సిబ్బంది అవస్థలు పడుతున్నారు. ఆ శాఖలో భాగమైన పీఐయూ (ప్రాజెక్టు ఇంప్లిమెంటింగ్ యూనిట్) కార్యాలయం ఎంతో కాలంగా ఉమ్మడి జిల్లా కేంద్రమైన కర్నూలులోనే కొనసాగేది. అయితే నంద్యాల జిల్లా కేంద్రం కావడంతో ఈ కార్యాలయం ఇక్కడికి రావాల్సిన అవసరముందని గుర్తించిన అధికారులు హడావుడిగా తరలించారు. ఈ మేరకు ఈనెల 1వ తేదీన ఉత్తర్వులు జారీ చేశారు. అయితే ఉన్నట్లుండి ఇలాంటి నిర్ణయం తీసుకోవడంతో చేసేదిలేక సిబ్బంది కార్యాలయ సామగ్రిని తెచ్చి స్థానిక పీఆర్ కార్యాలయంలో ఎక్కడ ఖాళీ స్థలం ఉంటే అక్కడ వేశారు. ప్రస్తుతం ఉన్న పీఆర్ జిల్లా ఇంజినీరింగ్ అధికారి కార్యాలయం పైన ఉన్న ఓ గదిని పీఐయూ కార్యాలయానికి కేటాయించారు. దీంతో సిబ్బంది సరైన వసతులు లేక అవస్థలు పడుతున్నారు. కనీసం కార్యాలయం మార్పుచేస్తున్నట్లు ఉన్నతస్థాయి అధికారులకు తెలియకుండానే జరుగుతుందా, తరలిస్తే కనీస వసతులు ఉన్నాయా? లేవా? అనే ఆలోచన ఏమాత్రం చేయకుండానే ఇలాంటి మార్పు చేయడం ఏమిటని పలువురు సిబ్బంది ప్రశ్నిస్తున్నారు.

సమాచారం లేకుండానే..

జిల్లాకు సంబంధించిన పీఐయూ కార్యాలయం కావడంతో అందులో దాదాపుగా 23 మందికి పైగానే సిబ్బంది పనిచేస్తున్నారు. ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు, డీఈ స్థాయి పీఏ, డీఏఓ, సూపరింటెండెంట్‌లు ఒక్కొక్కరు చొప్పున, ముగ్గురు ఏఈలు, రికార్డు, జూనియర్, సీనియర్ అసిస్టెంట్లు నలుగురు చొప్పున, ఇద్దరు టైపిస్టులు, టెక్నికల్, బీపీఓలు ఒక్కొక్కరితో పాటు అటెండర్లు విధులు నిర్వహించాల్సి ఉంది. అయితే పనిచేసే వారిలో మహిళా సిబ్బంది దాదాపుగా 10 మంది ఉన్నారు. కార్యాలయాన్ని కర్నూలు నుంచి నంద్యాలకు తరలించే సమయంలో అక్కడున్న సిబ్బందికి మాట మాత్రమైనా సమాచారం లేకుండా హడావిడిగా తరలించడంతో అవస్థలు పడుతున్నారు. ఈనెల 19వ తేదీ నుంచి సిబ్బంది ఇక్కడ విధులు నిర్వహిస్తున్నారు. అసంపూర్తిగా ఉన్న కార్యాలయంలో పని చేయలేక అవస్థలు పడుతున్నారు.

ఓ వైపు పనులు.. మరో వైపు విధులు..

అసలే నంద్యాల కొత్తగా ఏర్పాటు చేసిన జిల్లా కేంద్రం కావడంతో కార్యాయాలకు భవనాల కొరత ఉందన్న విషయాన్ని సైతం అధికారులు మర్చిపోయారా? అనే విమర్శలు వినిపిస్తున్నాయి. వసతులు ముందస్తుగా ఏర్పాటు చేసుకోకుండా ఆర్భాటాలు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇక్కడికి వచ్చాక అప్పటికప్పుడు కార్యాలయానికి రంగుల పూత వేస్తుండటంతో పాటు ఫ్యాన్లు ఏర్పాటు చేస్తూ కనిపించారు. దీంతో కార్యాలయానికి అక్కడి నుంచి తెచ్చిన టేబుళ్లు, బల్లలు, కుర్చీలు ఉంచే స్థలం లేక ఎక్కడపడితే అక్కడ వేశారు. ఇదిలా ఉండగా సిబ్బంది మాత్రం ఎక్కడ కూర్చోవాలో అర్థం కాక ఇబ్బందులు పడుతున్నారు.

భవన నిర్మాణానికి ప్రతిపాదనలు..

పీఐయూ కార్యాలయానికి ఏప్రిల్ నెలలోనే నూతన భవన నిర్మాణానికి రూ. 34 లక్షలతో ప్రతిపాదన చేసినట్లు సంబంధిత అధికారులు చెబుతున్నారు. ప్రతిపాదనలు చేసిన పనులు మంజూరై పనులు ప్రారంభించి భవన నిర్మాణం పూర్తి అయ్యేందుకు ఎంత సమయం పడుతుందో అర్థంకాని పరిస్థితి నెలకొంది. ప్రస్తుతం కనీసం సిబ్బంది కూర్చోవడానికి, కార్యాలయానికి సంబంధించిన టేబుళ్లు, బల్లలు, కుర్చీలు ఉంచేందుకు అనుగుణంగా ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.


ఫ్యాన్లు అమర్చుతున్న దృశ్యం


పీఐయూ కార్యాలయం కొనసాగనున్న భవనం ఇదే